టిడ్కో సెల్ఫీ.. పచ్చ డ్రామా!

- వాస్తవాన్ని వక్రీకరిస్తూ విష ప్రచారం
- అసంపూర్తి ఇళ్లను పూర్తిచేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- కాలవ తీరుపై మండిపడ్డ విప్ కాపు


టిడ్కో గృహ నిర్మాణాలు

రాయదుర్గం: టిడ్కో గృహ నిర్మాణాలపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు విడుదల చేసిన సెల్ఫీ ప్రజల్లో తీవ్ర విమర్శల పాలైంది. వాస్తవాన్ని వక్రీకరిస్తూ.. ఆయన హయాంలో చేసిన తప్పిదాలను దాచిపెట్టేలా విష ప్రచారం చేయడంపై పట్టణ వాసులు, వైఎస్సార్ సీపీ నాయకుల్లో ఆగ్రహాన్ని తెప్పించింది. రాయదుర్గం ప్రజల పుణ్యానా ఎమ్మెల్యేగా, రాష్ట్రానికి గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన కాలవ తన సొంత నియోజకవర్గంలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించలేక పోయాడని ఆరోపణలు వ్యక్తమయ్యాయి. టిడ్కో ఇళ్లపై సెల్ఫీలతో గొప్పలుపోయే కాలవ.. ఆనాడు ఆ శాఖ మంత్రిగా ఉంటూ కనీసం 50 శాతం పనులు కూడా పూర్తి చేయించలేక పోయడని లబ్ధిదారులు, పట్టణ వాసులు ఖండించారు. 2018– 2019 మధ్య కాలంలో 21 బ్లాకులుగా విభజించి మల్లాపురం సమీపాన 1008 టిడ్కో ఇళ్లు 300 చదరపు అడుల్లో నిర్మించి ఇవ్వాలని ప్రణాళికలు చేపట్టారు. వాటికోసం రూ.46.83 కోట్ల నిధులు కేటాయించారు. ఇప్పటి వరకు రూ.36 కోట్లు ఖర్చుపెడితే.. ఇందులో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రూ.10 కోట్లకుపైగా నిధులు మంజూరు చేసినట్టు అధికారుల రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. పూర్తి దశలో చేపట్టేందుకు మరో రూ.10 కోట్ల నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. ఆర్భాటంగా ప్రారంభించి పదవి దిగిపోయే నాటికి కేవలం 50 శాతం పనులు మాత్రమే చేపట్టి అరకొరగా వదిలేస్తే.. ఆ పనులన్నీ పూర్తి చేసేలా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి తన భుజాల పై వేసుకున్నారు. పేదలకు స్వగృహ యోగం కల్పించాలనే ఉద్దేశ్యంతో టిడ్కో సమస్యను పలుమార్లు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పూర్తి దశకు చేర్చేలా కృషి చేశారు.

మౌలిక సౌకర్యాల కోసం రూ.3.55 కోట్లు మంజూరు

టిడ్కో గృహాల వద్ద లబ్ధిదారుల సౌకర్యార్థం కోసం రోడ్లు, డ్రైనేజీలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ఇతర మౌలిక సౌకర్యాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.3.55 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో త్వరలో పనులు ప్రారంభించనున్నారు. అలాగే సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ) ఏర్పాటు కోసం రూ. 2.70 కోట్లు, ఇంటర్నల్ స్ట్రీట్ లైట్లు, కాలనీల్లో ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు కోసం రూ.44 లక్షలు, ప్రత్యేకంగా మినీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ. 3.35 కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విప్ మంజూరు చేయించారు. అలాగే ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ప్రజాసంకల్పయాత్ర లో 300 చదరపు అడుగుల టిడ్కో ఇళ్లను ఉచితంగా ఇస్తానని హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్ల కోసం నగదు చెల్లించిన 1008 మంది లబ్ధిదారులకు కేవలం రూ.1 మాత్రమే తీసుకుని రిజిస్ట్రేషన్ చేయించే గొప్ప కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టి పూర్తిచేసింది. దీంతో లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం కనిపిస్తోంది. గతంలో టీడీపీ వారు అన్నీ విధాల మోసం చేస్తే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నీ విధాల ఆదుకునేలా ముందుకు తీసుకెళుతోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కాలవవి అన్నీ ఉత్తకూతలే



గృహణ నిర్మాణశాఖ మంత్రిగా ఉండి సొంత నియోజకవర్గం లో పేదలకు ఇళ్లు కట్టించలేని నీచ బతుకు కాలవది. ఆయన హయాంలో సక్రమంగా ఆ కార్యక్రమం పూర్తి చేసి ఉంటే ఈ రోజు 35 వేలకు పైగా అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సిన దుస్థితి మాకు వచ్చేది కాదు. టిడ్కో గృహాలను ఎన్నికల సమయం వరకూ అడుగడుగునా నిర్లక్ష్యం చేసి ఓట్లు దండుకోవాలని చూసిన ద్రోహి ఎవరో లబ్ధిదారులకు చెప్పనక్కర్లేదు. ఇకపై ఉత్తుత్తి సెల్ఫీలు విడుదల చేయడం మానుకోవాలి. లేదంటే ప్రజలే తిరగబడి సమాధానం చెబుతారు.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే చర్యలు

బొమ్మనహాళ్: రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తే చర్యలు తప్పవని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్ హెచ్చరించారు. ఉద్దేహాళ్‌లో మంగళవారం ఫర్టిలైజర్‌షాపు డీలర్లు, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఏడీఏ మాట్లాడారు. ఎరువులు, పురుగుల మందులు, విత్తనాలు నాణ్యమైనవి విక్రయించాలన్నారు. కర్ణాటక నుంచి అనుమతులు లేనివి తీసుకొచ్చి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రిజిష్టర్లు, ఈపాస్ మిషన్‌లను అప్డేట్ చేయించుకోవాలన్నారు. మట్టి నమూనాల పరీక్షలు సకాలంలో పూర్తి చేయాలన్నారు. అర్హులకు సీసీఆర్‌సీ కార్డులు అందించేలా చూడాలన్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు, ప్రత్యేక క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రవణ్‌కుమార్, ఏఈఓ గోపాల్, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

కణేకల్లు: విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులను ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్, ఏఓ శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు. కణేకల్లులోని పెన్షనర్ల భవనంలో మంగళవారం ఫర్టిలైజర్‌షాపు యజమానులు, డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఏడీఏ, ఏఓలు మాట్లాడారు.

వీఆర్‌ఏకు గాయాలు

బొమ్మనహాళ్: మండలంలోని ఎల్‌బీ నగర్ గ్రామంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వీఆర్‌ఏ వన్నూరుస్వామికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని శ్రీధరఘట్ట వీఆర్‌ఏ వన్నూరుస్వామి విధి నిర్వహణలో భాగంగా ఎల్‌బీ నగర్ గ్రామ శివారులో ఓ రైతు పొలంలో భూ సర్వే కోసం ద్విచక్రవాహనంలో వెళ్తుండగా.. కుక్క అడ్డురావడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబీకులు 108లో బళ్లారి విమ్స్‌కు తరలించారు.

క్లుప్తంగా

నాగిరెడ్డిపల్లి మారెమ్మకు పూజలు


అలంకరణలో మారెమ్మ దేవి

బ్రహ్మసముద్రం: మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వెలసిన మారెమ్మదేవికి ఆషాడ మాసంలో పూజలు చేయడం ఆనవాయితీ. ఆషాడమాసం మొదటి మంగళవారం సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోండి


మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ హనుమప్ప

వజ్రకరూరు: ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈ హనుమప్ప, తహసీల్దార్ అనిల్‌కుమార్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వం అడ్వాన్సుగా రూ.20 వేలు ఇవ్వడానికి ముందుకు వచ్చిందన్నారు. పేదల సొంతింటి కలను నేరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలలిత, సర్పంచు మోనాలిసా, హౌసింగ్ ఏఈ చెన్నారెడ్డి, ఎంపీటీసీ ఫిరోజ్ భాను, సచివాలయ ఉద్యోగులు, హౌసింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

గర్భవతులు, బాలింతల చెంతకే పౌష్టికాహారం


ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి

ఉరవకొండ: రాష్ట్ర ప్రభుత్వం గర్భవతులు, బాలింతలకు వారి ఇంటి వద్దకే పౌష్టికాహారం కిట్లు అందించేందుకు చర్యలు తీసుకుందని, జూలై 1న కార్యక్రమం ప్రారంభిస్తామని ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి తెలిపారు. మంగళవారం ఉరవకొండ ఐసీడీఎస్ సీడీపీఓ కార్యాలయం తనిఖీ చేసిన అనంతరం పీడీ మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు రెండు విడతలుగా ఆయా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహార కిట్లు అందిస్తామన్నారు. మొదటి విడతలో మూడు కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అరలీటరు నూనె, 13 కోడిగుడ్లు, 2.50 లీటర్ల పాలు, రెండో విడతలో 12 గుడ్లు, 2.50 లీటర్ల పాలు పంపిణీ చేస్తామన్నారు.

గాలిమరల విద్యుత్ స్తంభాలు తొలగించాలి


కలెక్టర్ గౌతమికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పర్యటనలో భాగంగా కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయాన్ని కలెక్టర్ గౌతమి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా దళిత గిరిజన సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలిసి కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలో రహదారుల వెంట ఉన్న గాలిమరల విద్యుత్ స్తంభాలు వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వాటివల్ల వాహనదారులకు హాని జరిగే అవకాశం ఉందని, వెంటనే తొలగించి రహదారికి దూరంగా పవన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిప్పేస్వామినాయక్, దళిత జనజాగృతి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ కే రాజు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



కంబదూరు: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కుందుర్పి మండలం రుద్రంపల్లికి చెందిన వెంకటేష్ మంగళవారం కర్ణాటక మద్యాన్ని అక్రమంగా ద్విచక్ర వాహనంలో తరలిస్తుండగా సెబ్ స్పెషల్ పార్టీ టీం సీఐ నాగేంద్రప్రసాద్, కంబదూరు సెబ్ సీఐ మొహిద్దీన్ బాషా క్రిష్టాపురం క్రాస్ వద్ద పట్టుకున్నారు. నిందితుడి నుంచి ద్విచక్రవాహనంతో పాటు 288 బెంగళూరు విస్కీ,9 6 రాజా మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

గుమ్మఘట్ట: మండలంలోని జె.వెంకటంపల్లిలో కోడిపల్లి నాగరాజు అనే వ్యక్తి ఇంట్లో కర్ణాటకకు చెందిన 92 టెట్రా విస్కీ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ సునీత మంగళవారం తెలిపారు. మద్యం ప్యాకెట్లను సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించామన్నారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన


కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి సహకారం, సుశీల నేత్రాలయ మెటర్నటీ హాస్పిటల్ (కర్నూలు) ఆధ్వర్యంలో ఏర్పా టుచేసిన ఉచిత కంటి వైద్యశిబిరానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. అనంతరం కంటి వైద్య నిపుణుడు చంద్రశేఖర్ 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 60 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసి ప్రత్యేక వాహనాల్లో కర్నూలు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. వైద్యశిబిరానికి వచ్చిన వారికి భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, వైస్ ఎంపీపీ సుశీలారాణి, వజ్రకరూరు సర్పంచు మోనాలిసా, ఉపసర్పంచు మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ ఫిరోజ్‌భాను, ఆదర్శ పాఠశాల చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మహమ్మద్, బీసీ సెల్ కార్యదర్శి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమణయాదవ్, వార్డుసభ్యుడు మల్లికార్జునరెడ్డి, కంటి వైద్య సలహాదారులు నాగార్జున, భీమా తదిత రులు పాల్గొన్నారు.

చంద్రబాబు మేనిఫెస్టో ఓ బూటకం


సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి

రాయదుర్గం: మహానాడు వేదికగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో పెద్ద బూటకమని, ఎన్నికల ముందు లెక్కలేనన్ని హామీలు ఇవ్వడం.. ఆ తర్వాత వాటిని తుంగలో తొక్కడం బాబు కు వెన్నతో పెట్టిన విద్యగా మారిందని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి మండిపడ్డారు. డి హీరేహాళ్ మండలంలోని మల్లికేతిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లిన విప్ కాపు ఈ నాలుగేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం చేకూర్చిన లబ్ధిపై బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ నవతర్న పథకాలు నవశకానికి నాంది పలికాయన్నారు. కులమతాలు, పార్టీలు చూడకుండా అర్హతే ప్రమాణికంగా ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాల లబ్ధి చేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనన్నారు. 2019 ఎన్నికల్లో ప్రకటించిన మేనిఫెస్టోను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బైబిల్, ఖురాన్, భగవద్గీతలా భావించి 99 శాతం హామీలను నెరవేర్చారని గుర్తు చేశారు. 2014 ఎన్నికల్లో ఇచ్చిన 610 హామీల్లో చంద్రబాబు ఎన్ని నెరవేర్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు పాలనకు, జగన్ సంక్షేమ పాలనకు తేడా గుర్తించి, మంచి కోరే ప్రభుత్వానికి మద్దతుగా నిలవాలన్నారు.

కాలవా..? సొంత ఖర్చులతో ఒక్క మంచిపనైనా చేశావా..?

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు హయాం మొత్తం వెతికినా సొంత ఖర్చులతో ఒక్క మంచి పనికూడా చేపట్టలేదని విప్ విమర్శించారు. సంపద కోసమే రాజకీయాల్లోకి అనంతపురం నుంచి రాయదుర్గానికి వలస వచ్చాడన్నారు. ఆయన హయాంలో చేపట్టిన అరకొర పనులకే సెల్ఫీలు తీసి ఏదో ఒలకపెట్టినట్టు వ్యవహరిస్తున్నాడని ధ్వజమెత్తారు. రాజకీయాల్లోకి రాకముందే తాను రాయదుర్గం ప్రజలకు సేవకుడిగా ఉన్నానని గుర్తు చేశారు. నాపై ఎన్ని అపద్ధపు ఆరోపణలు చేసినా రాయదుర్గం ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో నమ్మబోరని హితవు పలికారు. నీకు, చంద్రబాబుకు 2024 ఎన్నికలే ఆఖరివనే విషయం గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, పార్టీ మండల కన్వీనర్ ఎం.వన్నూర్‌స్వామి, సచివాలయాల కన్వీనర్ రాళ్ల తిమ్మారెడ్డి, సర్పంచులు పార్వతి, మల్లికార్జున, శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున, హనుమంతురెడ్డి, ఎంపీటీసీ రంగమ్మ, గోవిందు, ఉప సర్పంచ్ నాగేష్, అంపన్న, సందీప్ పాటిల్, సురేష్‌యాదవ్, తిమ్మనగౌడ, పులకూర్తి చంద్ర, మల్లికార్జునరెడ్డి, సింగాడి మంజు, నాగయ్య, ఖాసీం పీరా తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్


గుమ్మఘట్ట: కలుగోడులో విద్యార్థినిని సన్మానిస్తున్న దృశ్యం


కంబదూరు: విద్యార్థినికి నగదు పురస్కారం అందజేస్తున్న దృశ్యం


కూడేరు: కొర్రకోడులో విద్యార్థిని సన్మానిస్తున్న దృశ్యం

గుమ్మఘట్ట: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమని జెడ్పీటీసీ సభ్యుడు పీఎస్ మహేష్ అన్నారు. మండలంలోని కలుగోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు పథకం కింద పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు పి.అర్చన, టి.లక్ష్మి, బి.రాజేష్‌కు నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ భవాని, హెచ్‌ఎం సోమనాథ్, పేరెంట్స్ కమిటీ చైర్మెన్ మల్లికార్జున, నాగేంద్రప్ప, అంజినప్ప, చెలిమేపల్లి రామాంజనేయులు పాల్గొన్నారు.

కంబదూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు శైలజ, సౌమ్య, పూజితకు మంగళవారం జగనన్న అణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా నగదు ప్రోత్సహకాలను అందించారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవింద్, సచివాలయల మండల కన్వీనర్ సాకే గంగాధర్, ప్రధానోపాధ్యాయుడు నాగరాజు, వార్డు మెంబర్ అబ్బాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలోని కొర్రకోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు సుశాంత్, సంధ్య ,బేబికి మంగళవారం పాఠశాలలో జగనన్న ఆణిముత్యాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్ పెద్దక్క, వైస్ చైర్మన్ గోపాల్, సొసైటీ ప్రెసిడెంట్ గంగాధర్, ప్రధానోపాధ్యాయురాల పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం

రాయదుర్గంటౌన్: ఎఈఓ–2గా నియమితులైన వెంకటరమేష్‌ను అభినందిస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప మంగళవారం సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ నాగమణి, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, దివాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

2న కురుబ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

రాయదుర్గంటౌన్: నియోజకవర్గంలో 2022–23 సంవత్సరంలో పది, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన కురుబ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులకు జులై 2న ప్రతిభా పురస్కాలను అందజేస్తున్నట్లు కనకదాస ఉద్యోగ, ఉపాధ్యాయ సేవా సంఘం పేర్కొంది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, పాండురంగ, కారుమంచి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని ఓబుళాచారీ రోడ్డు వద్ద ఉన్న రేవణసిద్దేశ్వరస్వామి ఆలయంలో పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు, కురుబ సామాజిక వర్గానికి చెందిన పెద్దలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులందరూ హాజరై జయప్రదం చేయాలన్నారు.

బాధ్యతల స్వీకరణ

తహసీల్దార్‌గా ఓబుళేసు



బొమ్మనహాళ్: తహసీల్దార్‌గా డి.ఓబుళేసు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టి అనంతపురానికి బదిలీ అయ్యారు. కాగా కళ్యాణదుర్గం ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతిపై ఓబులేసు బొమ్మనహాళ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. నూతన తహసీల్దార్‌కు డిప్యూటీ తహసీల్దార్ హుస్సేన్ పీరా, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల ప్రజాప్రతినిధులు, నాయకులు నూతన తహసీల్దార్‌ను సన్మానించారు.

బాధ్యతలు చేపట్టిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లు

కూడేరు: మండలంలోని మరుట్ల సచివాలయం ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా షేక్ బాబా పక్రుద్దీన్, ఉదిరిపికొండ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా మానస మంగళవారం బాధ్యతలు చేపట్టారు. వీరు ఆత్మకూరు, లేపాక్షి మండలాల నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. వారు ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషాని కలసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు.

ఎంఈఓ–2గా రమాదేవి

ఉరవకొండ: మండల విద్యాశాఖ అధికారి–2గా రమాదేవి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గుమ్మఘట్టలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేస్తున్న రమాదేవి పదోన్నతి పై ఉరవకొండ ఎంఈఓ–2 గా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఎంఈఓ ఈశ్వరప్ప, ఎమ్మార్సీ సిబ్బంది, ఏపీటీఎఫ్ నాయకులు సాకే భాస్కర్, ఓబన్న, చంద్రశేఖర్, నాగేంద్ర, లోకేష్, గీతావాణి తదితరులు ఆమె ఘనంగా స్వాగతం పలికారు.

కణేకల్లు: ఎంఈఓ–2గా ఆర్.భవానీశంకర్ మంగళవారం ఎమ్మార్సీలో బాధ్యతలను స్వీకరించారు. ఎంఈఓ–1 వెంకటేశ్‌బాబు, ఎమ్మార్సీ సిబ్బంది, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టి.శేషారెడ్డి, జిల్లా కౌన్సిలర్ శివారెడ్డి, చెన్నారెడ్డి, సూర్యకాంతరెడ్డి, వెంకటేశులు, మండలశాఖ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, కార్యదర్శి రామ్మోహన్‌గౌడ్ తదితరులు కొత్త ఎంఈఓను కలిసి సన్మానించారు.

ఎంఈఓగా మల్లికార్జున

బొమ్మనహాళ్: మండలంలో ఇన్‌చార్జి ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న తిమ్మప్ప బదిలీపై వజ్రకరూరు మండలంకు వెళ్లడంతో చంద్రగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున బొమ్మనహాళ్ ఎంఈఓగా పదోన్నతి పొంది బాధ్యతలు తీసుకున్నారు. మండలంలోని ఉపాధ్యాయ యూనియన్ల సంఘాల ప్రతినిధులు మంగళవారం ఎంఈఓ కార్యాయలం నందు విద్యాశాఖ అధికారికి స్వాగతం పలికారు. అనంతరం ఉపాధ్యాయులు ఎంఈఓను సన్మానించారు.

సంక్షిప్త సమాచారం

కేజీబీవీలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోండి

ఉరవకొండ: మండలంలోని చిన్నముష్టూరు సమీపంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో మిగిలి ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ప్రశస్తకుమారి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లకు పరీక్ష ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు మోడల్ స్కూల్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

శెట్టూరు: మండల కేంద్రలోని ఏపీ మోడల్ పాఠశాలలో మిగిన సీట్ల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గాయత్రి తెలిపారు. 7, 8,9 తరగతులలో ప్రవేశానికి ఆసక్తి ఉన్న విద్యార్థులు ప్రవేశ పరీక్ష ద్వారా సీటు పొందవచ్చన్నారు.

'జగనన్న సురక్ష' షెడ్యూల్ విడుదల

కూడేరు: మండలంలో జూలై 1 నుంచి 20వ తేదీ వరకూ నిర్వహించే 'జగనన్న సురక్ష'పై స్పెషల్ డ్రైవ్ షెడ్యూల్‌ను మంగళవారం ఎంపీడీఓ ముస్తఫా కమల్ బాషా విలేకరులకు వెల్లడించారు. 1న గొటుకూరు, తిమ్మాపురం, 4న కమ్మూరు, పి.నారాయణపురం, 11న కూడేరు–1, చోళసముద్రం, 15న కూడేరు–2, కొర్రకోడు, 18న ఇప్పేరు, ఉదిరిపికొండ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో కార్యక్రమం ఉంటుందన్నారు. తహసీల్దార్ శేషారెడ్డి , డీటీ విశ్వనాథ్, సీనియర్ అసిస్టెంట్ కాంతమ్మ ఒక బృందం, తాను , రీసర్వే డీటీ విజయకుమార్, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి మరో బృందంగా గ్రామ సభలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందాయా లేదా తెలుసుకుని అందకపోతే అందేలా చూస్తామన్నారు.

నిబద్ధతే ఉద్యోగికి కొలమానం

రాయదుర్గం రూరల్: క్రమశిక్షణ పాటిస్తూ , తోటి అధికారులు, సిబ్బందితో సమన్వయంగా బాధ్యతలు నిర్వర్తించే ఉద్యోగికి నిబద్ధతే కొలమానం కాగలదని ఎంపీడీఓ కొండయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఆయన అధ్యక్షతన ఏర్పాటు చేసిన వీడ్కోలు సభలో రాయదుర్గం నుంచి శెట్టూరు మండలానికి బదిలీ అయిన ఈఓపీఆర్డీ రఘురామారావును మంగళవారం ఘనంగా సన్మానించారు. ఏఓ చిక్కణ్ణ, సీనియర్ అసిస్టెంట్ రవిచంద్రశేఖర్ ఆజాద్, జూనియర్ అసిస్టెంట్ రాజసింహ, పంచాయతీ కార్యదర్శులు వేణుగోపాల్ రెడ్డి, భీమేష్, కొల్లన్న, అశోక్ , హేమంత్‌రాజు, శ్రీదేవి, యల్లక్క, వైఎస్సార్‌సీపీ నాయకుడు శివారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు , సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ముట్టడి

కణేకల్లు: మాల్యం ఫీడర్ లైన్ పునరుద్ధరించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఏడాదవుతున్నా విద్యుత్ లైన్ పునరుద్ధరించకపోవడంతో కోపోద్రిక్తులైన రైతులు మంగళవారం కణేకల్లు విద్యుత్ సబ్ స్టేషన్‌ను ముట్టడించారు. ఉదయం 10 గంటలకు సుమారు 70 మంది రైతులు విద్యుత్‌సబ్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. గంటన్నర పాటు రైతుల ఆందోళన కొనసాగింది. భారీ వరదలతో వేదవతి హగిరి మీదుగా వచ్చిన మాల్యం ఫీడర్ విద్యుత్‌లైన్ పూర్తిగా దెబ్బతిందని అప్పటి నుంచి వ్యవసాయానికి కరెంటు సరిగా లేదని రైతులు వాపోయారు. ఈ ఫీడర్ కింద సుమారు 1200 ఎకరాల వరకు భూమి ఉందన్నారు. ఏఈఈ శంకర్ కార్యాలయానికి రావడంతో రైతులు మూకుమ్మడిగా సమస్యను ఏకరువు పెట్టారు. ఏఈఈ స్పందిస్తూ పది రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

వేల్పుమడుగులో భూసార పరీక్షలు

విడపనకల్లు: నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగుచేయాలని మండల వ్యవసాయాధికారి పెన్నయ్య సూచించారు. మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో రైతులతో కలిసి ఆయన భూసార పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక దశలో గుర్తిస్తే వ్యాధి నయం

వజ్రకరూరు: కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని వైద్యాధి కారి పద్మ అన్నారు. మంగళవారం మండలంలోని గడేహోతురు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో కుష్టువ్యాధిపై ఆశాకార్యకర్తలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగేంద్రప్రసాద్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో కుష్టు వ్యాధి సర్వేపై క్షేత్రస్థాయి సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారిణి తేజశ్వి మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జూలై 16 వరకూ ఆశా కార్యకర్తలు కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. వైద్యాధికారి సర్దార్‌వలి, ఎంపీహెచ్‌ఈఓ గురుప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, సూపర్‌వైజర్ సుశీల, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయండి

కంబదూరు: విజయవాడలో వచ్చే నెల 7న నిర్వహించే ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ములకనూరు రామాంజి కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో నాయకులు గుద్దెళ్ల శంకర్, అండేపల్లి హరికుమార్, హరికృష్ణ, గంట నాగరాజు, గంగాధర్, శంకర్, మధు, దిలీప్, రఘు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు

కణేకల్లు: కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను ఇవ్వనున్నట్లు తహసీల్దార్ రజాక్‌వలి అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం సీసీఆర్‌సీ కార్డులపై సమీక్ష సమావేశం జరిగింది. వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్, ఎంపీఈఓలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

కూడేరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ శేషారెడ్డి, వ్యవసాయాధికారి విజయకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కౌలు రైతులకు రైతు భరోసా, పంట నష్ట పరిహారం వర్తింప చేస్తోందన్నారు. అదే విధంగా బ్యాంకులో పంటపై రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శైలజ, ఆర్బీకే సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

కుందుర్పి: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యామని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛో ఫెర్రర్ అన్నారు. మంగళవారం స్థానిక ఫెర్రర్ కమ్యూనిటీ భవన్‌లో అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాంఛో ఫెర్రర్ మాట్లాడుతూ మండలంలోని జంబుగుంపల, నిజవళ్లి పంచాయతీల్లో రూ. 22 కోట్లతో పండ్ల తోటలు, మొక్కల పెంపకం, చెక్ డ్యాంల నిర్మాణం వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. చిన్న సన్నకారు రైతులు పండ్ల మొక్కల పెంపకానికి ముందుకు వస్తే ఆర్డీటీ ప్రోత్సహిస్తుందన్నారు. అలాగే మండలంలోని ఆరు గ్రామ పంచాయతీల్లో సంస్థ పర్యవేక్షణలో సేంద్రియ పద్ధతుల్లో వివిధ రకాల పంటలు సాగు చేశామన్నారు. అనంతరం ఎస్‌కే చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు లెనిన్ బాబు, రీజనల్ మేనేజర్ లక్షణరావు, ఎస్టీఓ రామాంజనేయులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.